జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## నల్లగొండ

## సూర్యాపేట - యాదాద్రి భువనగిరి

మంగళవారం 16 జూన్ 2026 పేజీలు : 14




విద్యార్థుల ఆరోగ్యమే పరమావధి...

# విద్యార్థుల భద్రత సౌకర్యాలపై

# రాజీ లేదు

## జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్గొండ జూన్ 15(ప్రజాజ్యోతి ప్రతినిధి):**

జిల్లాలో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ కోరారు. పిల్లల భద్రత విషయంలో నిర్లక్ష్యం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ ఛాంబర్ నుంచి నిర్వహించిన జూమ్ సమావేశంలో విద్యా విద్యుత్, పంచాయతీరాజ్ , సోషల్ వెల్ఫేర్, మైనారిటీ, రెసిడెన్షియల్ విద్యాసంస్థల అధికారులుతో మాట్లాడారు. జిల్లాలో విద్యా సంవత్సరం ప్రారంభమైనందున ప్రతి పాఠశాల, హాస్టల్‌లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభమైన ...మిగతా 2లో



# రేవంత్ రెడ్డి

# మన ఓట్లు తొలగించే కుట్ర చేస్తున్నారు.

### తెలంగాణలో బిజేపి,కాంగ్రెస్ పార్టీలు కలిసే ఉన్నాయి

### బిఎల్‌ఏలు,బిఎల్‌ఓలను నీడలా వెంబడించాలి

### బి ఆర్ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్




**తుంగతుర్తి, జూన్ 15,(ప్రజా జ్యోతి):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,తన గురువు చంద్రబాబు ఎపిలో 2018లో సేవా మిత్ర యాప్ ద్వారా వైఎస్ఆర్ పార్టీకి సంబంధించిన ఓట్లు తొలగించినట్లే,బిఆర్ఎస్ పార్టీ ఓట్లు తొలగించే కుట్ర చేస్తున్నారని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. సోమవారం జాజిరెడ్డి గూడెం మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన తుంగతుర్తి నియోజకవర్గ,బిఆర్ఎస్ పార్టీ బిఎల్ఏల ఎస్ఐఆర్ అవగాహన సదస్సుకు మాజీమంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.తెలంగాణ రాష్ట్రంలో బిజేపి పార్టీ,కాంగ్రెస్ పార్టీ కలిసే ఉన్నాయని,ఆ రెండు పార్టీలు ఒక్కటై,తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రాకుండా చూడాలనే కుట్రతో,ఓట్లు తొలగించే కుట్ర చేస్తుందని మండిపడ్డారు. ఇటీవల పశ్చిమ బెంగాల్ లో జరిగిన ఎన్నికల సమయంలో ఎస్ఐఆర్ నిర్వహించి సుమారు 90 లక్షల ఓట్లు తొలగించి,మమత బెనర్జీ ...మిగతా 2లో

### టెట్ పరీక్షలను పకడ్బందీగా

# నిర్వహించాలి

### జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్ నాయక్



**నల్గొండ జూన్ 15(ప్రజాజ్యోతి ప్రతినిధి):**

జిల్లాలో టెట్ (టి ఇ టి) పరీక్షలను పకడ్బందీగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి దశరథనాయక్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ...మిగతా 2లో

### జిల్లాలో మొక్కలు నాటే

# కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టాలి

ఈ నెల 18న అన్ని శాఖలు పెద్ద ఎత్తున మొక్కలు నాతెందుకు చర్యలు తీసుకోవాలి
విద్యార్థి విద్యార్థినిలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక అధికారులు పాఠశాలలపై సమీక్షించాలి
ప్రజావాణి దరఖాస్తులు పెరుగుతున్నాయి
డివిజన్ కార్యాలయంలో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి డివిజన్ అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలి ..జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్



# విద్యార్థుల ఆరోగ్యమే పరమావధి...

**హాలియా,జూన్15(ప్రజా జ్యోతి)**

వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు కళాశాలలు పున: ప్రారంభం అవుతున్న నేపథ్యంలో మున్సిపల్ యంత్రాంగం అప్రమత్తమైంది. విద్యార్థుల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజా రమేష్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల కళాశాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుధ్య కార్మికులతో కలిసి పనులను వేగవంతం చేశారు. గత కొన్ని రోజులుగా మూసి ఉంచిన విద్యాసంస్థల ప్రాంగణాల్లో పిచ్చి మొక్కల తొలగింపు తాగునీటి ట్యాంకుల క్లీనింగ్ పనులను దగ్గరుండి పరిశీలించారు. పాఠశాలలు కళాశాలలు తెరిచే మొదటి రోజే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ వైస్ చైర్మన్ తీసుకున్న ఈ చర్యలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి మన ఓట్లు తొలగించే కుట్ర చేస్తున్నారు.

**తెలంగాణలో బిజెపి,కాంగ్రెస్ పార్టీలు కలిసే ఉన్నాయి**

**బిఎల్ఏలు,బిఎల్ఓలను నీడలా వెంబడించాలి**

**బి ఆర్ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

(మొదటి పేజీ తరువాయి)

పార్టీని ఓడించారని తెలిపారు. బిజెపి అధికారంలోకి వచ్చాక అక్కడ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై విపరీతంగా దాడులు జరుగుతున్నాయని గుర్తుచేశారు. అందుకే మనం అప్రమత్తంగా ఉండాలన్నారు. మానవ వనరుల శాఖ మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఓటు గల్లంతయ్యిందని, బెంగళూరులో రాహుల్ ద్రావిడ్ కూడా ఓటు వినియోగించలేకపోయారన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఏమరుపాటుగా ఉంటే మన ఓటు కూడా గల్లంతయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎన్యూమరేషన్ ఫారం నింపిన తర్వాత, వ్యక్తికి నోటీసు ఇవ్వకుండా ఓటు తొలగించే అధికారం ఎవరికీ లేదన్నారు,ఓటు తొలగించాలంటే ఖచ్చితంగా నోటీసు ఇవ్వాల్సిందేనన్నారు. అంతేకాకుండా 326 ప్రకారం ఎవరైనా వ్యక్తులు రెండు చోట్ల ఓటు హక్కు కలిగి ఉంటే, రిప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్ యాక్ట్ 1950 లోని సెక్షన్ 17,18 ప్రకారం ఏడాది పాటు జైలుకు వెళ్లాల్సి వస్తుందన్నారు. 2028లో కేసీఆర్ ను తిరిగి తెలంగాణ ముఖ్యమంత్రిగా చేసుకోవాలంటే బిఎల్ఏలే ప్రధాన పాత్ర పోషించాలని తెలిపారు.


18 సంవత్సరాలు నిండిన వారికి,నూతన ఓటు నమోదు చేయడానికి ఫారం 6 నింపి ఇవ్వాలని, బిజెపి,కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలు బిఎల్ఓ లను ప్రభావితం చేసి,దొంగ ఓట్లు వేయిస్తే,వెంటనే అధికారులకు ఫిర్యాదు చేసి, ఫారం 7 ద్వారా ఓట్లు తొలగించాలని సూచించారు. 2002 ఓటరు జాబితాలో పేరు లేని వారు, మ్యాపింగ్ టెక్నాలజీ ఆధారంగా ఓటు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ముసాయిదా ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు ఉన్నా, వెంటనే అభ్యంతరాలు తెలుపుతూ,ఫారం 8 ద్వారా సరిచేసుకోవాలన్నారు. తెలంగాణలో అభివృద్ధి పథంలో నడవాలంటే,తిరిగి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని,అందుకోసం ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొని ఖచ్చితంగా మన బూత్ లో ఉండే అన్ని కుటుంబాలను కలిసి అందరి ఓట్లు నమోదయ్యేలా చూడాలని,నిరంతరం బిఎల్ఓలను వెంట ఉండి ఓట్లు పోకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వెంకటేశ్వర్లు, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణ రెడ్డి, మాజీ జెడ్పీ చెర్పర్సన్ గుజ్జ దీపికా యుగంధర్ రావు, రాష్ట్ర నాయకులు నేవూరి ధర్మేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సంకేపల్లి రఘునందన్ రెడ్డి, మదర్ డైరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీ నర్సింహారెడ్డి మరియు ప్రజా ప్రతినిధులు,పార్టీ శ్రేణులు, బూత్ ఇంచార్జి లు కార్యకర్తలు, పెద్ద ఎత్తున హాజరయ్యారు



# విద్యార్థుల భద్రత సౌకర్యాలపై రాజీ లేదు

## జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

(మొదటి పేజీ తరువాయి)



నేపథ్యంలో పాఠశాలలు, హాస్టళ్లలో విద్యుత్ వైరింగ్, ఫ్యాన్లు, బల్బులు, ఎర్తింగ్ వ్యవస్థ, డిజిటల్ బోర్డులు, కంప్యూటర్ గదులు, తాగునీటి సదుపాయాలను పూర్తిగా తనిఖీ చేయాలని సూచించారు. గోడలు తడిగా ఉన్న చోట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా విద్యుత్ శాఖ అధికారులు పాఠశాలలను సందర్శించి తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు సకాలంలో అందజేయాలని ఆదేశించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, శానిటేషన్ చేయాలని పేర్కొన్నారు. హాస్టళ్లలో వార్డెన్లు, వంట సిబ్బంది, ఆయాలు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించేలా పర్యవేక్షించాలని, వంటశాలలు, కిచెన్లు, స్టోర్‌రూమ్‌లు పరిశుభ్రంగా ఉండాలని చెప్పారు. గ్యాస్ పైపులు, వంట సామగ్రిని తరచుగా తనిఖీ చేయాలని సూచించారు. పాఠశాలల పరిసరాల్లో కిరాణం షాపుల్లో మత్తు పదార్థాల విక్రయాలు, పాన్ షాపులు గుట్కాలు అనుచిత కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, అనుమానాస్పద సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థుల్లో ఎవరైనా మధ్యలో చదువు మానేస్తే వారి వివరాలను గుర్తించి ప్రత్యేక జాబితాలు రూపొందించాలని, తల్లిదండ్రులకు ఉన్నత విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో చదవడం, రాయడం నైపుణ్యాలు పెంపొందించాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం అన్ని పాఠశాలల్లో సక్రమంగా అమలవుతున్నదో లేదో పర్యవేక్షించాలని, పీఎంసీ పాఠశాలల్లో మిగిలిన మౌలిక సదుపాయాల పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా అన్ని పాఠశాలలు, హాస్టళ్లకు తాగునీరు అందేలా చూడాలని, గ్రామపంచాయతీలు నీటి నాణ్యత పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలని చెప్పారు. హాస్టళ్లలో, పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణం పూర్తి చేయడంతో పాటు మరమ్మతులు అవసరమైన చోట వెంటనే చేపట్టాలని, ప్రహరీ గోడల నిర్మాణ పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యా ప్రమాణాల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు తరచూ పాఠశాలలు, హాస్టళ్లను సందర్శించి పరిస్థితులను సమీక్షించాలని, అవసరమైతే హాస్టళ్లలో రాత్రి బస చేసి సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆదేశించారు. ఈ జూమ్ సమావేశంలో ట్రైనీ ఐఏఎస్ శ్రీకాంత్ రెడ్డి, విద్యుత్, విద్య, పంచాయతీరాజ్, సోషల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

# టెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఛాంబర్‌లో టెట్ పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ, పోలీసు శాఖ, విద్యుత్ శాఖ, ఆర్టీసీరవాణా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో టెట్ పరీక్షలు జూన్ 16 నుంచి 22, వరకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మొదటి సెషన్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటుందని, అభ్యర్థులు ఉదయం 8.30 గంటల లోపే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. రెండో సెషన్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుందని, అభ్యర్థులు మధ్యాహ్నం 1.30 గంటల లోపు హాజరు కావాలని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. జిల్లాలో ఎస్‌పీఆర్ స్కూల్‌లో మాత్రమే పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసినట్లు, మొత్తం 1,304 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) కావడంతో సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, లైటింగ్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖకు, అభ్యర్థులకు తగిన రవాణా సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. అత్యవసర వైద్య సేవల కోసం ఒక హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎం, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని వైద్య శాఖకు ఆదేశించారు. పరీక్షల సమయంలో భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండేలా పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలని, విద్యుత్ అంతరాయం తలెత్తిన సందర్భంలో జనరేటర్ సౌకర్యం సిద్ధంగా ఉంచాలని తెలిపారు. టెట్ పరీక్షల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పరీక్షలను విజయవంతం చేయాలని డీఆర్ఓ కోరారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర రావు, డి సూపరెంటెంట్ స్వర్ణలత, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరెంటెంట్ నీలం రెడ్డి, రాంబాబు, సీఎల్ఓ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# "గో టు విలేజ్"తో విద్యార్థుల్లో విద్యా చైతన్యం

## ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పోచంపల్లి టౌన్‌లో ప్రేరణాత్మక కార్యక్రమం

**భూదాన్ పోచంపల్లి, జూన్ 15 (ప్రజాజ్యోతి):**

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు నిర్వహిస్తున్న "గో టు విలేజ్" కార్యక్రమంలో భాగంగా సోమవారం భూదాన్ పోచంపల్లి మండల, టౌన్ కమిటీల ఆధ్వర్యంలో పోచంపల్లి టౌన్‌లోని పలు వార్డుల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని నాయకులు సూచించారు. విద్యే భవిష్యత్తుకు బాట అని పేర్కొంటూ, లక్ష్యసాధన కోసం కష్టపడి చదవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వారికి ప్రేరణ కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పాముకుట్ల బసవయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల లింగస్వామి, పోచంపల్లి టౌన్ అధ్యక్షుడు పోతగల శ్రీనివాస్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పెద్దల సుధాకర్, ఎర్ర పోచమ్మ గుడి చైర్మన్ పెద్దల రమేష్, మెహర్‌నగర్ మాజీ సర్పంచ్ సిరిపంగి వెంకటేశం, ఒరుగంటి రాకేష్, కుక్క నరేష్, మీసాల నరేష్, సాయి కృష్ణ తదితర ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



# శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో గిరిప్రదక్షిణ




**నార్కట్ పల్లి, జూన్ 15 ( ప్రజా జ్యోతి ):**

అమావాస్య సందర్భంగా సోమవారం శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో గిరి ప్రదక్షిణ కార్యక్రమం స్వామి వారి అనుగ్రహంతో దిగ్విజయంగా పూర్తి చేశారు. గిరి ప్రదక్షిణ లో ఉంద్యాల ప్రకాష్ రెడ్డి విహెచ్పి నల్గొండ జిల్లా ధర్మాచార్య సంపర్క ప్రముఖే మాట్లాడుతూ... చెరువుగట్టు శ్రీ పార్వతి సమేత జడల రామలింగేశ్వర స్వామి ఈ ఆలయం ఎంతో పవిత్రమైనదని, పరశురాముడు 108 వ విగ్రహంగా ఈ శివలింగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఆలయం చాలా పవిత్రమైనదని, ఎంతో పుణ్యమైనదని ఇక్కడ కోరికలు కోరుకున్న వారికి కొంగుబంగారంగా నెరవేరుతుందని, గిరి ప్రదక్షిణ చేయడం వల్ల ఎన్నో కోట్ల జన్మలకు పూర్తి చేస్తున్నదని, చెరువుగట్టులో గిరి దర్శనం చాలా ప్రాముఖ్యత కనుక భక్తులందరూ వినియోగించుకుని వాళ్ళ ఇది ఒక మంచి మార్గమని వివరించారు. ప్రతి ఒక్కరూ అమావాస్య రోజు ఉదయం 6:30 నుండి ఇది ప్రదక్షిణలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ఆ భగవంతుని పూజించి వాళ్ల కోరిక నెరవేర్చుకొని ముక్తి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో గురు స్వామి వెంకటయ్య, నాగరాజు, లింగస్వామి, గురు స్వామి బల్లి యాదగిరి, భాను ప్రకాష్ రెడ్డి, పున్న సందీప్, వెంకటయ్య, వెంకన్న గురుస్వామి, లో విత్ చంద్రారెడ్డి, ఆంజనేయులు చారి పాల్గొన్నారు.

# మా ఊరికి ప్రైవేట్ పాఠశాలల బస్సులు రావొద్దు !

**మోత్కూరు, జూన్ 15 (ప్రజా జ్యోతి):**

మోత్కూర్ మండలం పొడిచేడు గ్రామానికి ప్రైవేటు పాఠశాలల బస్సులు రావద్దని, మీ పాఠశాలలకు మా ఊరి పిల్లలను పంపమని మా ఊరి ప్రభుత్వ బడిలోనే పిల్లలను చేరిపిస్తామని ఆ గ్రామ సర్పంచ్ జిట్ట సైదులు ఆధ్వర్యంలో సోమవారం ప్రైవేటు పాఠశాలల బస్సులను అడ్డుకున్నారు. పొడిచేడు గ్రామ సర్పంచి సైదులు , వార్డు సభ్యులు రచ్చ శివకుమార్, నల్ల రామనర్సయ్య, కడమంచి వెంకటేష్ , కడమంచి రాంబాబు, ఓర్సు మల్లేష్ , ఓర్సు గోపి, ఓర్స్ వెంకన్న, బలికే లక్ష్మయ్య, అంబటి దామోదర్, జిట్టగిరి ,పి నాగరాజు తదితరులు గ్రామంలోకి వచ్చిన మోత్కూర్ కు చెందిన ప్రైవేట్ పాఠశాల బస్సులను, అమ్మనబోలుకు చెందిన ప్రైవేట్ స్కూల్ బస్సులను గ్రామంలోకి రాకుండా సోమవారం అడ్డుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య ఉంటుందని, ప్రభుత్వ పాఠశాలలకే తమ పిల్లలను పంపాలని, ప్రైవేటు పాఠశాలలకు తమ పిల్లలను పంప వద్దని గ్రామ పంచాయతీ గ్రామసభ ఏకగ్రీవంగా తీర్మానించినట్లు సర్పంచ్ వివరించారు.




# ప్రైవేట్ ఫీజుల దోపిడి అరికట్టాలంటూ ఎం ఇ ఓ కి బిసి యూత్ ఫిర్యాదు

**మిర్యాలగూడ, జూన్ 15,( ప్రజాజ్యోతి ):**

మిర్యాలగూడ పట్టణంలో అత్యధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారి ధర్మానాయక్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుండి డబ్బులు వసూళ్లే లక్ష్యంగా అడ్మిషన్ ఫీజు పేరిట, 5,000 రూపాయలు వసూళ్లు చేస్తూ కొన్ని పాఠశాలలో డొనేషన్ పేరిట 50,000 రూపాయల వరకు వసూళు చేస్తున్నారని ఆరోపించారు.పుస్తకాలు, యూనిఫామ్, బెల్ట్,టై లు అత్యధిక డబ్బులకు అమ్ముతూ విద్యార్థులు యాజమాన్యాల దగ్గరనే తీసుకోవాలని ఒత్తిడి చేయడంతోతల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో ఉంటున్నారని అన్నారు. మిర్యాలగూడలో ఇంత విచ్చలవిడిగా విద్యా వ్యాపారంకొనసాగుతున్నప్పటికీ కూడా విద్యాశాఖ అధికారులు,ప్రజాప్రతినిధులపట్టించుకోకపోవడంతో వారి దోపిడి మరింతగా పెరిగిందని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో వ్యాపారం చేస్తున్నయాజమాన్యాలపై చర్యలు తీసుకొని ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలను సీజ్ చేయాలని ఆయన అన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించాడు ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా కన్వీనర్ సిద్ధం రాజు, పట్టణ నాయకుడు పట్టేటి రమేష్, మునగాల శైలేందర్, లక్ష్మణ్, రాము, శంకర్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి :సర్పంచ్ దున్నా శ్రీనివాస్.



**నడిగూడెం ,జూన్ 15, ప్రజా జ్యోతి:**

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ కోరారు. సోమవారం నడిగూడెం మండల కేంద్రంలో అంగన్వాడి సెంటర్ 4 నందు అంగన్వాడీ టీచర్ల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అంగన్వాడీ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులను 1 వ తరగతిలో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు బుక్స్, యూనిఫామ్, మధ్యాహ్న భోజనము, సాయంత్రం స్నాక్స్ ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రభుత్వ బడులలో మౌలిక వసతులు కల్పిస్తున్నారని తెలిపారు. మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిల సహకారంతో పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని అని తెలిపారు. అంగన్వాడి సూపర్వైజర్ సరిత మాట్లాడుతూ. ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి మానసిక ఒత్తిడి గురికాకుండా ఆట పాటలతో విద్యను అందిస్తారని మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కొండలమ్మ, స్వర్ణ కుమారి,శకుంతల, కవిత,ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బాబురావు, నాగలక్ష్మి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి ... సర్పంచ్ దున్నా శ్రీనివాస్.

**నడిగూడెం, జూన్ 15, ప్రజాజ్యోతి:**

నర్సరీ లో మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ కోరారు. సోమవారం నడిగూడెం మండల కేంద్రంలోని నర్సరి ని ఎంపీఓ ఆంజనేయులతో కలసి నర్సరిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వన సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలని కోరారు. ఎంపీఓ మాట్లాడుతూ మొక్కలు నాటే ప్రాంతాలను ముందస్తుగా గుర్తించాలని ఫీల్డ్ అసిస్టెంట్ కు సూచించారు. నర్సరీ నిర్వహణపై సంతృప్తి వ్యక్తపరచి నర్సరీ సేవకురాలు శ్రీలక్ష్మిని అభినందించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ ఉన్నారు.



# 12 ఏళ్ల తర్వాత తెరుచుకున్న పాఠశాల

**నాంపల్లి, జూన్,15(ప్రజా జ్యోతి)**

మండలంలోని రాందాస్ తండాలో గత 12 ఏళ్లుగా మూతబడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సోమవారం పునః ప్రారంభమైంది. అట్టి పాఠశాలను ఆ గ్రామ యువకులు, ఉద్యోగస్తులు, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామస్తులందరూ కలిసి పాఠశాలకు దాదాపు రూ. లక్ష విరాళం వెచ్చించి పాఠశాలకు మరమ్మత్తులు చేయించారు. తొలి రోజు 15 మంది విద్యార్థులు పాఠశాలలో చేరడంతో హర్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి కే మల్లికార్జున రావు, ప్రధానోపాధ్యాయులు అజయ్ కుమార్ లు విద్యార్థులకు బ్యాగులు, పాఠ్య పుస్తకాలు అందించడం జరిగింది. అట్టి పాఠశాలకు పక్క పాఠశాల నుండి రఘుపతి అనే ఉపాధ్యాయుని తాత్కాలికంగా సర్దుబాటు చేయడం జరిగింది. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాల పున ప్రారంభించడం చాలా సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్పి కేశవులు, పాల్గొన్నారు.



# వర్షాకాలానికి ముందస్తుగా తమ్మరవాగు పూడికతీత పనులు

**కోదాడ టౌన్, జూన్ 15 (ప్రజా జ్యోతి):**



కోదాడ పట్టణంలోని తమ్మరవాగు బ్రిడ్జిని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు, కమిషనర్ రమాదేవి సోమవారం పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న పూడికతీత పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపాలిటీ ముందస్తు చర్యలు చేపడుతోందన్నారు. తమ్మరవాగులో పూడిక తొలగించడం ద్వారా వర్షపు నీటి ప్రవాహం సాఫీగా జరిగి వరద ముప్పు తగ్గుతుందని తెలిపారు. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం కమిషనర్ రమాదేవి మాట్లాడుతూ డ్రైనేజీలు, కాల్వల పూడికతీత పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాల సమయంలో నీరు నిల్వ కాకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు. ప్రజలు కూడా చెత్తను కాల్వల్లో వేయకుండా మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు కాటంరాజు, నాగేశ్వరరావు, గంధం బాలేంద్ర పాండు, మాజీ వైస్ ఎంపీపీ మందలపు శేషయ్య, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ డివైడర్లు ఏర్పాటు



**ఆలేరు జూన్ 15 ప్రజా జ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో మంతపురి రోడ్డు నుండి రఘునాథపురం రోడ్డుకు వెళ్లే ఫ్లైఓవర్ పైన ఆలేరు మున్సిపల్ నిధులతో రోడ్డు మధ్యలో ప్లాస్టిక్ డివైడర్లను సూచిక బోర్డులను సోమవారం మున్సిపల్ చైర్మన్ బాలమణి భాస్కర్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ యాలాద్రి, వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు, కౌన్సిలర్లు ఆంజనేయులు, జూకంటి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# డివిజన్ స్థాయి ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి -ఆర్డీఓ రమణారెడ్డి





**మిర్యాలగూడ , జూన్ 15,( ప్రజాజ్యోతి ):**

నల్లగొండ జిల్లా కలెక్టరేట్ కు నిరుపేద గ్రామీణులు వెళ్లే పరిస్థితి లేదని గమనించి డివిజన్ స్థాయి అధికారులతో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ ఆర్డీఓ ఎస్. రమణారెడ్డి కోరారు. వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులతో మిర్యాలగూడ రెవిన్యూ డివిజన్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజావాణినిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రతి రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో గ్రామీణ ప్రజల సౌకర్యార్థం ప్రజావాణినిర్వహిస్తున్నామని ప్రజల అర్జీలు స్వీకరించి సత్వరం పరిష్కరించాలని అధికారులను కోరారు. అందుబాటులో ఉన్న డివిజన్ స్థాయి ప్రజావాణిలో ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. ప్రజావాణిలో సుమారు 6 ఫిర్యాదులు రాగా సంబంధిత అధికారులకు అందజేసి సత్వరం పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాసాచారి, మునిసిపాలిటీ మేనేజర్ జి.జ్ఞానేశ్వరి, ఐసిడిఎస్ మిర్యాలగూడ అర్బన్ పిఓ వేణు, మిర్యాలగూడ డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవరావు, ఎంపీడిఒ ఎం. శేషగిరిశర్మ, ఎంఎఓ ఎం.ఋష్యేంద్రమణి, ఉద్యానవన శాఖ డివిజన్ అధికారి నసీమా మెహ్రిన్, నీటిపారుదల శాఖ ఆర్ అండ్ బి, నీటిపారుదల, ఆర్ డబ్ల్యూఎస్, హౌజింగ్ డిఇఇలు శ్రీనివాస్, ఎండి.అహ్మదుల్లా, జనార్ధన్, వి.సతీష్, శంకర్, విద్యుత్ ఎఇ నవీన్, ఐసీడిఎస్ దామరచర్ల పిఒ శాంతి, మిర్యాలగూడ సూపర్వైజర్ కె.నాగమణి, ఏక్సైజు ఎస్ఐ షేక్ పర్వీన్, ఎంపిఒ ఎం.రమేష్, హెచ్ డబ్ల్యూఒ జానిమియా, ఉపాధి హామీ పథకం నాగేశ్వరరావు, విద్యాశాఖ నుండి నిరంజన్, పాల్గొన్నారు.

# మంగమ్మ పార్థివదేహానికి నివాళులు



**ఆలేరు జూన్ 15 ప్రజా జ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణానికి చెందిన సిపిఎం నాయకులు మంగ నరసింహులు సతీమణి మంగమ్మ అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి మాజీ డిసిజిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి వారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ శంకరయ్య, మాజీ సర్పంచ్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు

# ఆలేరు పట్టణంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి

**ఆలేరు జూన్ 15 ప్రజా జ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో నిత్యం జరుగుతున్న దొంగతనాల గురించి అలాగే ప్రమాదాల గురించి మున్సిపల్ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఐ యాలాద్రికి మున్సిపల్ వైస్ చైర్మన్ ఆంజనేయులు కోరగా వెంటనే సిఐ యాలాద్రి మాట్లాడుతూ త్వరలోనే పట్టణ ప్రజలతో మరియు వ్యాపారవేత్తలతో సమావేశం ఏర్పాటు చేసి అందరి సహకారంతో ఏర్పాటు చేద్దామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మల్లెల శ్రీకాంత్, సిద్ధులు, నరేష్ తదితరులు పాల్గొన్నారు



# విద్యుత్ షాక్ తో పాడి గేదె మృతి

**హాలియా,జూన్15(ప్రజా జ్యోతి)**

విద్యుత్ షాక్ తో పాడి గేదె మృతి చెందిన ఘటన హాలియా పట్టణంలోని సాయి ప్రతాప్ నగర్ లో సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. హాలియా పట్టణంలోని సాయి ప్రతాప్ నగర్ కాలనీలో శనివారం రాత్రి వీచిన గాలులకు విద్యుత్ స్తంభం పడిపోయింది. ఆదివారం అనుముల శంకర్ కు చెందిన పాడి గేదె మిర్యాలగూడ రోడ్డు లోని ఆంజనేయ రైస్ మిల్ సమీపంలో విద్యుత్ షాక్ కు గురై మృతి చెందింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే పాడి గేదే మృతి చెందిందని రైతు వాపోయాడు. మృతి చెందిన గేదె విలువ రూ. లక్ష వరకు ఉంటుందని స్థానికులు వివరించారు. ఘటనపై విద్యుత్ శాఖ అధికారులు పశువైద్యాధికారికి ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. ప్రభుత్వం తగిన పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరారు.



# నరసింహ కుటుంబానికి అండగా నిలిచిన టై అండ్ డై వర్కర్స్ అసోసియేషన్



**చౌటుప్పల్, జూన్ 15 ( ప్రజాజ్యోతి )**

కొయ్యలగూడెంకు చెందిన ఎక్కలదేవి నరసింహ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబానికి కొయ్యలగూడెం టై అండ్ డై వర్కర్స్ అసోసియేషన్ సభ్యులు అండగా నిలిచారు. సోమవారం నరసింహ కుటుంబ సభ్యులను పరామర్శించిన సంఘం ప్రతినిధులు వారి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ తరఫున రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.
నరసింహ మృతి తీరని లోటని పేర్కొన్న సంఘం సభ్యులు, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. భగవంతుడు మృతుడి ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబానికి ఈ విషాదాన్ని భరించే శక్తిని ప్రసాదించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# విద్య హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్ కు ఫిర్యాదు

**మిర్యాలగూడ, జూన్ 15,( ప్రజాజ్యోతి ):**

మిర్యాలగూడ పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లో ఉన్నటువంటి ప్రైవేటు పాఠశాలల్లో విద్య హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ నోట్ పుస్తకాలు,పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుండి బలవంతంగా అక్రమ ఫీజులు వసూలు చేయడం నిరసిస్తూ సోమవారం బీసీ,ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం, మాల మహానాడు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్య యాదవ్ మాట్లాడుతూ స్కూళ్లు ప్రారంభమైన రోజున్నే ప్రైవేటు పాఠశాలలయాజమాన్యాలు అక్రమాలకు తెర లేపడం విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘించడమన్నారు. ఇంతకన్నా దుర్మార్గం ఇంకెక్కడుంటుంది అని ప్రశ్నించారు. మిర్యాలగూడ పట్టణంలోని అనేక ప్రైవేట్ పాఠశాలలు మరియు దామరచర్ల మండల కేంద్రంలోని ఢిల్లీ గ్లోబల్ స్కూల్ యాజమాన్యం విద్యార్థి స్కూల్లో అడ్మిషన్ పొందటానికి సుమారు 3వేల నుండి 5వేల రూపాయల వరకు వసూలు చేయడం,మా స్కూల్లోనే నోట్ బుక్స్ ,పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ కొనాలి అని డిమాండ్ చేయడం అన్యాయం అన్నారు. విద్యాశాఖ అధికారులే మీరు అమ్ముకోండి మీకేం ఇబ్బంది లేదని చెప్పినారు అని చెప్పడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. ప్రైవేటు పాఠశాలల అక్రమ ఆగడాలు ఇన్ని జరుగుతున్న విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహించడం పై జిల్లా కలెక్టర్ కి సవివరంగా వివరించినట్లు తెలిపారు.



తక్షణమే ప్రైవేటు పాఠశాలల పై విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ని కోరినట్లు తెలిపారు. స్పందించిన కలెక్టర్ తక్షణమేచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్, మాల మహానాడు విద్యార్థి విభాగం జాతీయ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సురేష్, మాల మహానాడు మిర్యాలగూడ యువజన విభాగం అధ్యక్షుడు బైరం క్రాంతి కుమార్, బైరం లక్ష్మీనారాయణ, బీసీ సంఘం నాయకులు చిలకల శ్రీనివాస్ యాదవ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గౌడ యువజన విభాగం మోత్కూరు మండల అధ్యక్షులుగా గోవర్ధన్ గౌడ్



**మోత్కూరు, జూన్ 15 (ప్రజా జ్యోతి):**

తెలంగాణ గౌడ యువజన విభాగం మోత్కూరు మండల అధ్యక్షులుగా బుజిలాపురం గ్రామానికి చెందిన మోల్కపురి గోవర్ధన్ గౌడ్ ను నియామకం చేస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోల్కపురి శ్రీకాంత్ గౌడ్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. గౌడ యువజన సంక్షేమ సంఘం లో క్రియాశీలకంగా పని చేస్తున్న గోవర్ధన్ సేవలను గుర్తించి నియామకం చేసినట్లు సోమవారం ఆయన విలేకరులకు తెలిపారు.

# యువ వికాసం పథకం అమలు చేయాలి

## తెలంగాణ రక్షణ సేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కందడి మణిపాల్ రెడ్డి

**ఆలేరు జూన్ 15 ప్రజా జ్యోతి**





యువ వికాసం పథకం అమలు చేయాలని నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి మంజూరు చేయాలని తెలంగాణ రక్షణ పార్టీ ఆలేరు నియోజకవర్గ ఇన్చార్జి కందడి మణిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోట కొండూరు మండలం చందపల్లి గ్రామానికి చెందిన మణిపాల్ రెడ్డి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతి పత్రం అందజేస్తూ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలు వేస్తా అని మాయ మాటలు చెప్పి అబద్ధపు మాటలు యువతకు ఇచ్చి నమ్మించి చాలామంది యువత కోచింగ్ సెంటర్లలో లక్ష మంది లక్షలు ఖర్చు చేసి పెట్టి నిరుద్యోగ యువత ఒక పూట అన్నం తిని మరొక పూట పస్తులు ఉండి నీళ్లతో సరిపెట్టుకున్నటువంటి పరిస్థితులు యువత బాధపడుతున్నారన్నారు. పోలీస్ డిపార్ట్మెంట్లో 20000 పైగా ఖాళీలు ఉన్నందున ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయాలని యువతకు ఉన్న నైపుణ్యాన్ని మరియు టాలెంట్ను గుర్తించే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగానికి అప్లికేషన్ ఫీజు 1000 నుండి వందరూపాయల వరకు తగ్గించాలన్నారు. ప్రైవేటు సెక్టార్లో స్థానిక యువతకు 70% ఉద్యోగాలు కేటాయించాలన్నారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వం జాబు క్యాలెండర్ వెయ్యాలన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని యువతకు అవకాశాలు లేకపోవడం వల్ల యువత డ్రగ్స్ కు మరియు మద్యపానానికి బానిసలుగా మారుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులకే ప్రీ-ప్రైమరీ టీచర్ పోస్టుల్లో ప్రాధాన్యత ఇవ్వాలి

**ఆలేరు, జూన్ 15 (ప్రజా జ్యోతి):**

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని మూటకొండూరు, కాటేపల్లి, ముత్తిరెడ్డిగూడెం, చామాపురం గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ టీచర్ (ఆయా) పోస్టులు మంజూరైన నేపథ్యంలో, ఆయా నియామకాలలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రాధాన్యత కల్పించాలని ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడు ఆడెపు శ్రీనివాస్ మాదిగ సోమవారం మండల విద్యాశాఖ అధికారికి రాఘరామ్ రెడ్డి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు గ్రామ గ్రామాన ప్రచారం చేస్తూ, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫారాలు తదితర సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ప్రీ-ప్రైమరీ టీచర్, ఆయా పోస్టుల నియామకాల విషయంలో మాత్రం ప్రైవేట్ పాఠశాలల్లో తమ పిల్లలను చదివిస్తున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవడం విచారకరమన్నారు.
ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం ఉంచి తమ పిల్లలను అక్కడే చదివిస్తున్న తల్లిదండ్రులకు ఈ పోస్టుల్లో అవకాశం కల్పిస్తే ప్రభుత్వ విద్యా వ్యవస్థపై మరింత విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించే కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ప్రభుత్వ విద్యాభివృద్ధికి తోడ్పాటు అందుతుందని తెలిపారు.
జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించి, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకే ప్రీ-ప్రైమరీ టీచర్, ఆయా పోస్టుల నియామకాలలో అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎంఆర్పీఎస్ తరఫున కోరారు.

# మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు పరచాలి

**మోత్కూరు, జూన్ 15 (ప్రజా జ్యోతి):**



మున్సిపల్ కార్మికులకు ఎన్నికల సమయంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేస్తూ సోమవారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో మున్సిపల్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ పోస్టులను పర్మినెంట్ చేయాలని, రెండవ పిఆర్సి లో నెలకు రూ. 26 వేల జీతం నిర్ణయించాలని, వేతనాలలో ఎలాంటి తగ్గింపు లేకుండా సిబ్బందికి కేటగిరీల వారీగా అమలు చేయాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని, అనారోగ్యానికి గురైన, చనిపోయిన మున్సిపల్ కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను రీప్లేస్మెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మెంట ఎల్లయ్య, యూనియన్ మండల అధ్యక్షులు డి. లింగమ్మ, ఎన్ అండాలు, అరవింద్, అవినాష్ ,వెంకన్న, కే లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో మొక్కలు నాటే కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టాలి

**ఈ నెల 18న అన్ని శాఖలు పెద్ద ఎత్తున మొక్కలు నాతెందుకు చర్యలు తీసుకోవాలి**

**విద్యార్థి విద్యార్థినిలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక అధికారులు పాఠశాలలపై సమీక్షించాలి**

**ప్రజావాణి దరఖాస్తులు పెరుగుతున్నాయి**

**డివిజన్ కార్యాలయంలో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి డివిజన్ అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలి**

**జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్**

నల్గొండ జూన్ 15(ప్రజాజ్యోతి ప్రతినిధి): ఈనెల 18 న రాష్ట్ర ప్రభుత్వం వనమహోత్సవం కార్యక్రమం కింద పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించనున్న దృష్ట్యా జిల్లాలో మొక్కలు నాటే కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం అయన కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో జిల్లా అధికారులతో కలిసి ప్రజల వద్ద నుండి పిర్యాదులను స్వీకరించారు. సోమవారం నుండి పాఠశాలలు పునః ప్రారంభమైనందున పిల్లలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక అధికారులు పాఠశాలలపై సమీక్షించాలని, రాష్ట్రప్రభుత్వం పాఠశాలల పునః ప్రారంభానికి ముందే పాఠశాలలు, హాస్టళ్లలో అన్ని వసతులు కల్పించడం జరిగిందని, ముఖ్యంగా హాస్టల్లలో విద్యార్థులకు భోజనానికి సంబంధించిన టెండర్లు అన్నింటిని పూర్తి కాగానే వర్క్ఆర్డర్ ఇచ్చి అవసరమైన సామాగ్రి తెప్పించుకోవాలన్నారు. యూనిఫార్మ్ క్లాత్ రాగానే కొత్తవారికి కూడా కొలతలు తీసుకొని యూనిఫార్మ్ కుట్టించే ఏర్పాటు చేయాలన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18న అన్ని శాఖలు పెద్ద ఎత్తున మొక్కలు నాతెందుకు చర్యలు తీసుకోవాలని, అంతేకాక సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా చేపట్టాలన్నారు. అటవీ శాఖ ద్వారా రెండు లక్షల 80000, డిఆర్డిఓ, పంచాయతీరాజ్ ద్వారా 31 లక్ష, వ్యవసాయ, మున్సిపల్, రెవిన్యూ, తదితర శాఖల ద్వారా నిర్దేశించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటేందుకు అన్ని శాఖలు నూరు శాతం లక్ష్యాలు పూర్తి చేసే విధంగా కృషి చేయాలని అన్నారు. అలాగే వర్షాకాలం ప్రారంభమైనందున అన్ని విద్యాసంస్థలు ప్రభుత్వ సంస్థల లో వాననీటి సంరక్షణ కట్టడాలను నిర్మించాలని తెలిపారు. గ్రామాలలో, పట్టణాలలో కుక్కకాటుకు ఇబ్బంది పడకుండా పారిశు ధ్యం పై దృష్టి సారించాలని అన్నారు. గడిచిన రెండు నెలల నుండి ప్రజావాణి దరఖాస్తులు పెరుగుతున్నాయని, డివిజన్ కార్యాలయంలో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి డివిజన్ అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, లేకుంటే చర్య తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంధిరమ్మ ఇండ్ల లో భాగంగా రెండో విడత ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినందున మండలాలలో ఇల్లు లేని వారిని గుర్తించి వెంటనే జీవో ద్వారా నియమించిన గజిటెడ్ అధికారితో పరిశీలన చేయించాలని తెలిపారు. ఈ విషయంలో నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు చురుకుగా వ్యవహరించాలని చెప్పారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులు నకిలీ విత్తనాలు కొని మోసపోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వరిలో 10.10 వెరైటీ లేకుండా



చూడాలని ,అలాగే యూరియాకు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. అంగన్వాడి ద్వారా ఫ్యాన్లు, లైట్ల పనులను నూటికి నూరు శాతం పూర్తి చేయాలని చెప్పారు. కాగా సోమవారం



నాటి జిల్లా స్థాయి ప్రజావాణి కి రెవిన్యూ శాఖకు 55, ఇతర శాఖలకు 80 ఫిర్యాదులు వచ్చాయి. ట్రైనీ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డిఆర్ఓ దశరథ నాయక్, డి ఎఫ్ఓ రాజశేఖర్, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, ఇతర అధికారులు, ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు.



# బ్యాడ్మింటన్ లో సత్తా చాటిన టంగుటూరి సాయితేజ




**మిర్యాలగూడ, జూన్ 15,( ప్రజాజ్యోతి ):**

సికింద్రాబాద్‌లోని రైల్వే ఇండోర్ స్టేడియంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'మేరు బ్యాడ్మింటన్ 2026 – సీజన్ 3' పోటీలు సోమవారం విజయవంతంగా ముగిశాయి. ఈ క్రీడల్లో మిర్యాలగూడకు చెందిన టంగుటూరి సాయి తేజ అద్భుతమైన ప్రదర్శనతో సత్తా చాటారు.ముఖ్య అతిథులుగా ఏపూరు భాస్కర్ రావు, ఐఏఎస్ (అడిషనల్ కలెక్టర్, యాదాద్రి భువనగిరి జిల్లా), కీర్తి వేణుగోపాల్ గారు (మున్సిపల్ కమీషనర్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్), కొండా మోహన్ గారు ( డి ఎఫ్ ఓ ) పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో మిర్యాలగూడకు చెందిన క్రీడాకారుడు టంగుటూరి సాయితేజ అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. సాయి తేజ డబుల్స్ విభాగంలో ప్రథమ బహుమతిని, సింగిల్స్ విభాగంలో ద్వితీయ బహుమతిని గెలుచుకుని తన సత్తాను చాటుకున్నాడు. విజేతలకు తెలంగాణ రాష్ట్ర మేరు సంఘం అధ్యక్షుడు పెండ్యాల చంద్రమోహన్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా




ఆయన మాట్లాడుతూ, క్రీడల్లో రాణిస్తున్న యువతను ప్రోత్సహిం చడం అభినందనీయమని, సాయి తేజ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పెండ్యాల గిరిధర్ మేరు, గుద్దేటి అరుణ్ కుమార్ మేరు, కొత్తపల్లి రమేష్ కుమార్ మేరు, కొవ్వూరు చంద్రకాంత్ మేరు, కర్నే ధరణి మేరు, రాపర్తి సాయినాథ్ మేరు, కొవ్వూరు ముఖేష్ మేరు, రుమాండ్ల జ్యోతిక మేరు టంగుటూరి రాజారాం మేరు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణపై నియోజకవర్గ స్థాయిలో బిఎల్ఏ లకు పకడ్బందీ శిక్షణ ఇవ్వాలి

## జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్గొండ జూన్ 15(ప్రజాజ్యోతి ప్రతినిధి)**

: ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణపై నియోజకవర్గ స్థాయిలో బిఎల్ఏ లకు పకడ్బందీ శిక్షణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ చెప్పారు. సోమవారం ఆయన ఉదయాదిత్య భవన్ లో ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణపై ఈఆర్వోలు, ఎన్నికల విభాగం డిప్యూటీ తాహసిల్దారులు, బిఎల్ఓ సూపర్వైజర్లను ఉద్దేశించి ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శిక్షణ తీసుకున్న సూపర్వైజర్లు కింది స్థాయిలో అదే రకమైన శిక్షణను ఇవ్వాలని, ఎలాంటి సందేహాలకు తావు లేకుండా శిక్షణ ఇవ్వాలని చెప్పారు. బి ఎల్ ఈ లకు బిఎల్ఓ సూపర్వైజర్లు శిక్షణ ఇవ్వాలని,





ప్రత్యేకించి ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కింద రూపొందించిన ముసాయిదా జాబితా ప్రదర్శనలో ఒకటికి రెండుసార్లు తనిఖీ చేసుకొని ప్రదర్శించాలని, ఒక చోట నుండి మరోచోటికి చిరునామా మారిన ఓటర్లు, ఆబ్సెంట్ ఓటర్లు అన్నిటిని జాగ్రత్తగా పరిశీలించుకోవాలని చెప్పారు. బి ఎల్ వో సూపర్వైజర్లు ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా జాగ్రత్తగా ఓటరు జాబితా సమగ్ర సవరణను పూర్తి చేయాలని ఆదేశించారు. మాస్టర్ ట్రైనర్ బాలు, తదితరులు శిక్షణ ఇచ్చారు.

# కొత్త ఆశలు.. కొత్త పుస్తకాలతో విద్యార్థులకు విద్యా బాట

భూదాన్ పోచంపల్లి, జూన్ 15 (ప్రజాజ్యోతి):

పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ (బి) పాఠశాలలో సోమవారం విద్యార్థులకు నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. కృష్ణయ్య మాట్లాడుతూ, కొత్త విద్యా సంవత్సరం విద్యార్థుల జీవితాల్లో కొత్త ఆశలు, కొత్త అవకాశాలకు నాంది పలుకుతుందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ అనూష, 13వ వార్డు కౌన్సిలర్ రాధిక రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కై అనేక కార్యక్రమాలు అమలు చేస్తుంది

## విద్యార్థులకు ఫౌండేషన్ లిటరసీ సంఖ్యశాస్త్ర సామర్థ్యాలు పెంచాలి

## ప్రతి విద్యార్థికి మాతృ భాషతో పాటు, హిందీ, ఇంగ్లీష్ తప్పనిసరిగా చదవడం, రాయడం, మాట్లాడడం వచ్చి ఉండాలి

## ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలతో పాటు , పరిశుభ్రత, పాఠశాల ఆవరణము శుభ్రంగా ఉంచుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రతను బోధించాలి

## జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్గొండ జూన్ 15(ప్రజాజ్యోతి ప్రతినిధి):**

ఎఫ్ ఎల్ ఎం లో జిల్లాను మొదటి స్థానంలో ఉంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలోని మర్రి గూడేం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఫౌండేషన్ లిటరసీ సంఖ్యశాస్త్ర సామర్థ్యాలు పెంచాల్సిన అవసరం ఉందని, ఇందులో భాగంగా ఉపాధ్యాయులకు అక్టోబర్, నవంబర్లో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి విద్యార్థికి మాతృభాషతోపాటు, హిందీ, ఇంగ్లీష్ తప్పనిసరిగా చదవడం, రాయడం, మాట్లాడడం వచ్చి ఉండాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలతో పాటు , పరిశుభ్రత, అలాగే పాఠశాల ఆవరణము శుభ్రంగా ఉంచుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రతను బోధించాలని, అలాగే జీవితం గురించి పిల్లలకు తెలియజేయాలని, వారు భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదిగేందుకు తరగతులు ప్రారంభమయ్యే ముందు బోధించాలని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమంలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కై అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని, అందువల్ల పిల్లలు బాగా చదువుకోవాలని, చెప్పింది వినాలని అన్నారు. అలాగే పాఠశాల ఆవరణను శుభ్రంగా ఉంచుకోవాలని, దాంతోపాటు, వ్యక్తిగతంగా పరిశుభ్రంగా ఉండాలని, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, సొంత స్వీయ క్రమశిక్షణ కలిగి ఉండాలని చెప్పారు. త్వరలోనే విద్యార్థులకు కొత్త యూనిఫామ్ రానుందని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఈ అకాడమిక్ విద్యా సంవత్సరం నుండి పాఠశాల విద్యార్థులకు అల్పాహారాన్ని అందించనుందని, కొత్తగా పాఠశాలలో చేరిన







విద్యార్థులకు కూడా యూనిఫామ్ ఇచ్చేందుకు కొలతలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకోవాలని, ముఖ్యంగా 10 తర్వాత ఎట్టి పరిస్థితులలో పాఠశాల మానివేయవద్దని, ఉద్యోగం రావాలన్న లేదా వారి కాళ్లపై వారు నిలబడాలన్న పై చదువులు చదవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి. సురేందర్రావు, కార్పొరేటర్లు శంకరయ్య, మోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.



# విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం.. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్








నల్గొండ జూన్ 15(ప్రజాజ్యోతి ప్రతినిధి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ఉద్దేశమని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా సోమవారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రం బొట్టుగూడలోని కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి తరగతులను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీలు ప్రారంభమైనట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని, విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్యను అందించాలన్న ముఖ్య ఉద్దేశంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ఇందులో భాగంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనంతోపాటు, ఉదయం అల్పాహారం కూడా అందించనున్నానని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. విద్యార్థులకు త్వరలోనే నూతన యూనిఫామ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. జిల్లాలో మూతపడ్డ కొన్ని ప్రాథమిక పాఠశాలలు ప్రారంభించాల్సిందిగా సర్పంచులు అడుగుతున్నారని, వాటిని కూడా ప్రారంభిస్తామని, పాఠశాలలు, హాస్టల్లో చిన్న చిన్న మరమ్మతులను చేపట్టి అన్నింటిని విద్యార్థులకు సౌకర్యంగా తీర్చిదిద్దినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, పాఠశాల యాజమాన్యం, స్థానిక కార్పొరేటర్ తదితరులు ఉన్నారు.

## అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ పంపిణీ చేయాలి...



**నూతనకల్ ..జూన్15 (ప్రజా జ్యోతి):**

మండలంలోని చిల్పకుంట్ల గ్రామంలో 12 సంవత్సరాల క్రితం టిఆర్ఎస్ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఈరోజు ఉదయం నీరు పేద ప్రజలు ఆక్రమించడానికి ప్రయత్నం చేశారు ప్రభుత్వ అధికారులు హుటాహుటిన చేరుకొని 15 రోజుల్లో పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు ఇట్టి ఇండ్లు పంపిణీ జరగాక శిధిలావస్తాకు చేరాయి తలుపులు కిటికీలు పగిలిపోయి గోడలు బీటలు వారి నీళ్ల ట్యాంకులు పగిలిపోయి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారాయి ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి ఎలాంటి పైరవీలకు తావు లేకుండా నిజమైన లబ్ధిదారులకు పంపిణీ చేయాలని రాజకీయ నాయకుల జోక్యం లేకుండా నిజమైన లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తూ ఎమ్మార్వో గారికి మెమోరాండం అందించారు ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కందాల శంకర్ రెడ్డి పులుసు సత్యం సర్పంచి అంజపల్లి నరసమ్మ అంజపల్లి లక్ష్మయ్య బొజ్జ శీను బొజ్జ విజయ్ ఉప్పుల వెంకన్న ఇరుగు శీను తొట్ల అచ్చయ్య గజ్జల శ్రీనివాస్ రెడ్డి ఉప్పుల రమేష్ మరియు మహిళలు నిరుపేదలు కార్యకర్తలు పాల్గొన్నారు



## ఎరువుల యాజమాన్య పద్ధతులపై అవగాహన



**ఆలేరు జూన్ 15 ప్రజా జ్యోతి**

ఎరువుల యాజమాన్య పద్ధతులు మరియు చీడపీడల యాజమాన్య నిర్వహణ, సన్న రకం వడ్ల పై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని కొలనుపాకలో కావేరి కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మన్మధరావు, డాక్టర్ కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. సన్న రకాల వడ్లలో సంపూర్ణ ప్రైజు, గ్లోరీ రకాలతో మంచి దిగుబడి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ శివరామకృష్ణ, సోమేశ్వర రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ బైరి రమేష్ గౌడ్, రైతులు మాధవరెడ్డి, కుమ్మరిండ్ల బాల నర్సయ్య గౌడ్, బెల్లంకొండ వేణు, రాజయ్య, మల్లేష్, గడ్డమీది రాజు గౌడ్ తదితరులు ఉన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతలపాలెం, జూన్ 15 (ప్రజా జ్యోతి): చింతలపాలెం మండల పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్లకు అంతరాయం కలిగించే చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమాన్ని ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కే. సైదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పనుల నేపథ్యంలో ఆయా ఫీడర్ల పరిధిలో తాత్కాలికంగా విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. 16వ తేదీన చింతలపాలెం టౌన్, దొండపాడు, కిష్టాపురం, తమ్మారం గ్రామాల్లో, 17వ తేదీన గుడి మల్కాపురం, వజినేపల్లి, చింత్రియాల గ్రామాల్లో, 18వ తేదీన చింతలపాలెం ఏజీఎల్, కాకతీయ, తమ్మారం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. 19వ తేదీన ప్రాజెక్ట్ ఫీడర్, మిషన్ భగీరథ ఫీడర్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగిలి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి తరలి వెళ్లిన నాయకులు

నూతనకల్... జూన్ 15 (ప్రజా జ్యోతి):
అర్వపల్లి మండల కేంద్రంలో జరిగే ముఖ్య కార్యకర్తల సమావేశానికి మండల కేంద్రం నుండి సోమవారం బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తంగా ఉందని వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని వారన్నారు పార్టీ బలోపేతానికి ప్రతి బిఆర్ఎస్ కార్యకర్త కృషి చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మున్న మల్లయ్య యాదవ్ మాజీ పిఏసిఎస్ చైర్మన్ కనకటి వెంకన్న బత్తుల సాయిల్ గౌడ్ గాడిదల లింగరాజు జటంగి సరిత కృష్ణ చురుకంటి లావణ్య మధుసూదన్ రెడ్డి మహేశ్వరం మల్లికార్జున్ ఉప్పుల మొగుళ్ళ వెంకన్న వీర్ యాదవ్ వీరమల్ల యాదగిరి బద్దం వెంకటరెడ్డి బండి అనిల్ కిరణ్ సత్తిరెడ్డి తదితరులు వెళ్లారు



# ప్రజావాణి అర్జీలను పెండింగ్ లేకుండా పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ భాస్కరరావు

**భువనగిరి, జూన్ 15 (ప్రజాజ్యోతి న్యూస్):**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి మొత్తం 75 అర్జీలు అందాయి.ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రజావాణిలో అందిన అర్జీల్లో రెవెన్యూ శాఖకు 49, ఉపాధి కల్పన శాఖకు 4, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్‌కు 4, హౌసింగ్ శాఖకు 4, జిల్లా పరిషత్‌కు 4, విద్యాశాఖకు 2, గ్రామీణాభివృద్ధి శాఖకు 2, పంచాయతీ శాఖకు



2, సంక్షేమ శాఖ, సివిల్ సప్లైస్, అటవీ శాఖ, ఎస్సీ వెల్ఫేర్ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జడ్పీ సీఈవో శోభారాణి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వ్యవసాయ బావిలో చిక్కుకున్న జింకకు ప్రాణదానం

## – రైతుల సాహసంతో సురక్షితంగా బయటపడిన వన్యప్రాణి



**ఆత్మకూర్(ఎం), జూన్ 15(ప్రజా జ్యోతి):**

ఆత్మకూర్(ఎం) మండలంలోని కొరటికల్ గ్రామ శివారులో బిక్కేరు వాగు సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో జింక ప్రత్యక్షమైంది. నీటి కోసం వచ్చిన జింక ప్రమాదవశాత్తు బావిలో పడిపోయినట్లు స్థానికులు భావిస్తున్నారు. బావిలో చిక్కుకుని బయటకు రాలేకపోతున్న జింకను గమనించిన రైతులు వెంటనే అప్రమత్తమై రక్షణ చర్యలు చేపట్టారు. స్థానిక రైతులు ఎంతో చాకచక్యంగా వ్యవహరించి జింకకు ఎలాంటి గాయాలు కాకుండా బావిలో నుంచి సురక్షితంగా బయటకు తీశారు. అనంతరం ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు తెలియజేయగా, వారు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని జింకను తమ ఆధీనంలోకి తీసుకుని ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. జింకను రక్షించిన రైతుల సేవాభావాన్ని గ్రామస్తులు అభినందించారు. సమయస్ఫూర్తితో స్పందించి ఓ మూగజీవి ప్రాణాలను కాపాడిన రైతులు ప్రశంసలు అందుకుంటున్నారు.

# బడిబాట తొలి రోజే విద్యార్థికి విద్యుత్ షాక్

## ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమంటూ ఆగ్రహం

**మల్లేపల్లి, యబఅ15,(ప్రజాజ్యోతి):**

నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో బడిబాట తొలి రోజే ఓ విద్యార్థి విద్యుత్ ఘాతానికి గురైన ఘటన తీవ్ర కలకలం రేపింది. వేసవి సెలవుల అనంతరం సోమవారం పాఠశాలలు పునఃప్రారంభమైన సందర్భంగా పాఠజూన్ ప్రధాన గేటుకు మామిడాకుల తోరణాలు కట్టే ఏర్పాట్లు చేపట్టారు. పాఠశాల సమీపంలో ఆడుకుంటున్న విద్యార్థి రామ్ చరణ్ (13)ను తోరణం కట్టేందుకు సహాయం చేయాలని ఉపాధ్యాయులు పిలిచినట్లు సమాచారం. నాంపల్లి మండలం బండ తిమ్మాపురం గ్రామానికి చెందిన జ్యోతి, శేఖర్ దంపతుల కుమారుడైన రామ్ చరణ్ పాఠశాల ఇనుప గేటు ఎక్కి తోరణం కడుతున్న సమయంలో పక్కనే ఉన్న విద్యుత్ తీగను ప్రమాదవశాత్తు తాకడంతో తీవ్ర విద్యుత్ షాక్‌కు గురయ్యాడు.విద్యుత్ ఘాతంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన బాలుడిని ఉపాధ్యాయులు, స్థానికులు వెంటనే దేవరకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడికి చికిత్స కొనసాగుతోంది.ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న దేవరకొండ ఆర్డీవో, దేవరకొండ డీఎస్పీ, మల్లెపల్లి తహసీల్దార్‌తో పాటు సంబంధిత అధికారులు పాఠశాలను సందర్శించి ఘటనకు సంబంధించిన వివరాలను ఆరా తీశారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై సమాచారం సేకరించి, సంఘటనపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.పాఠశాల ప్రారంభమైన తొలి రోజే ఈ ఘటన జరగడంతో తల్లిదండ్రులు, గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల భద్రతపై నిర్లక్ష్యం వహించారని, అటెండర్లు, సిబ్బంది ఉన్నప్పటికీ ప్రమాదకరమైన పని కోసం విద్యార్థిని వినియోగించడం సరైందికాదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఘటనపై విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు తీవ్రంగా స్పందించాయి. బాధ్యులైన ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని, గాయపడిన విద్యార్థికి మెరుగైన వైద్యం, న్యాయం అందించాలని డిమాండ్ చేస్తున్నాయి.



# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

భువనగిరి, జూన్ 15 (ప్రజాజ్యోతి న్యూస్): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు అందించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ తెలిపారు. సోమవారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని సింగన్నగూడెం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లతో పాటు తుర్కపల్లి మండలం వాసాలమర్రి, కొండాపురం, భువనగిరి మండలం అనంతారం గ్రామాల్లో



నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల అమలు పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సింగన్నగూడెంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని ఆదేశించారు.వాసాలమర్రి, కొండాపురం, అనంతారం గ్రామాల్లో మంజూరైన ఇళ్ల సంఖ్య, పూర్తయిన ఇళ్లు, నిర్మాణ దశలో ఉన్న ఇళ్లు, ఇంకా ప్రారంభం కాని ఇళ్ల వివరాలను తెలుసుకున్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లను సందర్శించి పరిశీలించారు. ప్రభుత్వం అందించిన సహాయంతో సొంత ఇంటి కల నెరవేరిందా అని లబ్ధిదారులతో ముచ్చటించారు.గ్రామాల్లో పూరిగుడిసెలు, డేరాలు, మట్టి గోడల ఇళ్లు, రేకుల షెడ్లలో నివసించే నిరుపేదలను గుర్తించి వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అనంతారం గ్రామానికి చెందిన ఆగమ్మ ఇంటిని సందర్శించిన అధికారులు ఆమెతో మాట్లాడారు. సొంత ఇల్లు నిర్మించుకున్న తర్వాత చాలా సంతోషంగా ఉందని, ఎన్నో ఏళు ్లగా ఉన్న కల ఈ ప్రభుత్వ హయాంలో నెరవేరిందని ఆగమ్మ తెలిపారు. ప్రస్తుతం భద్రంగా, గౌరవంగా సొంత ఇంట్లో నివసిస్తున్నామని, ఇందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి అర్హులందరికీ గృహ సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ అలివేలు, ఎంపీడీవోలు, ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ తీగలు తగిలి పాడి గేదె మృతి

వలిగొండ, జూన్ 15 (ప్రజాజ్యోతి న్యూస్): వలిగొండ మండల పరిధిలోని సంగెం గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై పాడి గేదె మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కాటేపల్లి బాలరాజ్‌కు చెందిన సుమారు రూ లక్ష యాభై వేల విలువైన పాడి గేదె విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం, రెండు రోజుల క్రితం కురిసిన గాలివానకు ఓ విద్యుత్ స్తంభం విరిగి నేలపై పడిపోయింది. అయితే మరమ్మత్తులు పూర్తిగా చేపట్టకుండా విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలిపారు. ఆ ప్రాంతం గుండా వెళ్తున్న పాడి గేదె నేలపై ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. ఈ ఘటనతో రైతు కుటుంబం తీవ్ర ఆవేదనకు గురైంది. జీవనాధారంగా ఉన్న పాడి గేదె మృతి చెందడంతో భారీ ఆర్థిక నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.



బాధిత రైతుకు తక్షణమే నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు.

# 20 రోజుల్లో శివగంగ ఎత్తిపోతల నీళ్లు

## రైతులకు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

## – చైర్మన్ గుడిసె వెంకట్ రెడ్డి

చింతలపాలెం, జూన్ 15 (ప్రజా జ్యోతి): చింతలపాలెం మండలంలోని పాత వెల్లటూరు సమీపంలో ఉన్న శివగంగ ఎత్తిపోతల పథకం ద్వారా మరో 20 రోజుల్లో సాగునీటి సరఫరా ప్రారంభించనున్నట్లు శివగంగ ఎత్తిపోతల పథకం చైర్మన్ గుడిసె వెంకట్ రెడ్డి తెలిపారు. దీంతో రైతులకు త్వరలో సాగునీరు



అందుబాటులోకి రానుంది. రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఎత్తిపోతల పథకంలోని మోటార్లు, పంపుసెట్ల మరమ్మతు పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న మరమ్మతు పనులు వారం రోజుల్లో పూర్తవుతాయని, మోటార్ల నిర్వహణకు అవసరమైన రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మరో పది రోజుల్లో అందుబాటులోకి వస్తాయని చెప్పారు. మరమ్మతు పనులు పూర్తికాగానే మోటార్లను ప్రారంభించి పథకం పరిధిలోని ఆయకట్టు రైతులకు సాగునీటిని సరఫరా చేస్తామని ఆయన పేర్కొన్నారు. రైతులకు నీటి కొరత తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొండపాటి వెంకట్ రెడ్డి, మెకానికల్ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపాలి

**చౌటుప్పల్, జూన్ 15 ( ప్రజాజ్యోతి ) :**

చౌటుప్పల్ మున్సిపాలిటీలో డ్రగ్స్, గంజాయి వినియోగం పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేస్తూ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్‌గౌడ్ సోమవారం డీఎస్పీ మధుసూదన్‌రెడ్డి, సీఐ మన్మథ్ కుమార్‌లకు వినతిపత్రం అందజేశారు. బెల్ట్‌షాపుల నిర్వహణ, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా రక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. చౌటుప్పల్ పరిసర ప్రాంతాలు అంతర్రాష్ట్ర గంజాయి రవాణాకు మార్గంగా మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల బస్టాండ్ పరిసరాల్లో గంజాయి పట్టుబడిన ఘటనలను ప్రస్తావిస్తూ, అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. వినతిపత్రంపై స్పందించిన డీఎస్పీ మధుసూదన్‌రెడ్డి డ్రగ్స్ మాఫియా, గంజాయి రవాణాదారులు, బెల్ట్‌షాపుల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక దృష్టి సారించి అక్రమ కార్యకలాపాలను అణచివేస్తామని తెలిపారు.



# 4,16వ వార్డు లో సమస్యలు పరిష్కరించాలని...బిజెపి వన్ టౌన్ ఆధ్వర్యంలో కమిషనర్ కి వినతి

**మిర్యాలగూడ, జూన్ 15,( ప్రజాజ్యోతి ):**

మిర్యాలగూడ పట్టణంలోని 4వ,16వ వార్డులలో సుదీర్ఘ కాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం భారతీయ జనతా పార్టీ వన్ టౌన్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ శ్రీజా రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రధాన సమస్య అయినటువంటి అసంపూర్తిగా నిలిచిపోయిన అండర్ గ్రౌండ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని,మరియు ఎస్ఎస్ టవర్స్ నుండి మయూరి నగర్, గొల్లగూడ మీదుగా వెళ్లే ప్రధానమురికి కాలువ పూడిక తీత తీయకపోవటం వలన చిన్నపాటి వర్షానికి కాలనీ మొత్తం జలమయమై వ్యాధులు వ్యాపిస్తున్నాయన్నారు. వీటికి తోడుగా విష సర్పాలు సైతం సంచరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.కావున మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి ప్రజా ప్రయోజనార్థం ఇట్టి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని భారతీయ జనతా పార్టీ




డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ పట్టణ అధ్యక్షుడు బంటుగిరి,ప్రధాన కార్యదర్శి కొంగర వెంకటరమణ,మూల రాజిరెడ్డి,గోన కవితా రెడ్డి, వెంకటేశ్వర్లు, శివ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల కోసం అధ్యాపకుల వేట..

**నూతనకల్.. జూన్ 15 (ప్రజా జ్యోతి):**

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల కోసం అధ్యాపకులు గ్రామ గ్రామాన తిరుగుతున్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరాలని కోరుతున్నారు. అందుకు జూనియర్ నెమ్మికల్ అధ్యాపకులు సోమవారం నూతనకల్, ఎర్ర పహాడ్, చిన్ననేమిల, పెద్ద నేమిలా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల వివరాలను సేకరించారు ఆయా పాఠశాలల్లోని ఉత్తీర్ణులైన విద్యార్థుల యొక్క ఫోన్ నెంబర్లు హాల్ టికెట్ నెంబర్లను తీసుకొని విద్యార్థుల తల్లిదండ్రులను కలుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలలో చేరిన విద్యార్థుల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతుంది.మధ్యాహ్న భోజనం ఉచిత పాఠ్యపుస్తకాలు మెటీరియల్ పంపిణీ తో పాటు స్కాలర్షిప్లను కూడా మంజూరు చేస్తుంది. విద్యార్థులు ఎలాంటి ఫీజులు లేకుండా ఇంటర్మీడియట్ చదువుకునే అవకాశాన్ని కల్పించింది. ప్రభుత్వ కళాశాలలో చేరుతున్న విద్యార్థులు ఉత్తీర్ణులైన తర్వాత ఇంజనీరింగ్ మెడిసిన్ తదితర వృత్తి విద్యా కోర్సులను ఉచితంగా అందిస్తోంది ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలోని చేర్పించాలని అధ్యాపకులు వినూత్నంగా ప్రచారం నిర్వహించారు తల్లిదండ్రులు తమ విద్యార్థుల భవిష్యత్తు కోసం నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ కళాశాలలోనే తమ విద్యార్థులను చేర్పిస్తామని హామీ ఇచ్చారు. నాగార్జున ఉన్నత పాఠశాలలో 35 మంది విద్యార్థులు విద్యనభ్యసించగా వారిని చేర్పించాలని కరస్పాండెంట్ మారగాని




వెంకన్నను అభ్యర్థించారు ఆయన స్పందిస్తూ తమ పాఠశాలలో జరిగిన విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలో చేర్పించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తామని వివరించారు అదేవిధంగా ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు నాయక్ ను కలవగా ఆయన పాఠశాలలో చదివిన 90 మంది విద్యార్థుల్లో 85 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని వారిలో ఇప్పటికే 20 మంది విద్యార్థులు నిమ్మికల్ ప్రభుత్వ కళాశాలలో చేరినట్లు పేర్కొన్నారు అనంతరం చిన్న నేమిల పెద్ద నేమిలా ఎర్ర పహాడ్ ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి శివయ్య లతోపాటు రామలింగారెడ్డి ని కలిసి ప్రభుత్వ కళాశాలలో ఉన్న వసతుల వివరాలను అధ్యాపకులు గుణగంటి వెంకటేశ్వర్లు సైదాచారి లింగయ్య లైబ్రేరియన్ గురువారెడ్డిలు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు,విద్యార్థులకు సూచించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే పోలీసుల లక్ష్యం..

## గ్రీవెన్స్ డేలో బాధితుల ఫిర్యాదులు స్వీకరించి పరిశీలించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్గొండ జూన్ 15,(ప్రజా జ్యోతి ): జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీ శరత్ చంద్ర పవార్ ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించి పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితులు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా మొత్తం దాదాపు 63 మంది బాధితులు భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక మోసాలు, సైబర్ నేరాలు, తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను అందజేశారు. ప్రతి ఫిర్యాదును ఎస్పీ సంబంధిత అధికారులకు తక్షణ విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు న్యాయం అందించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని, ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని ఎస్పీ స్పష్టం చేశారు. బాధితుల సమస్యలను సానుభూతితో వినడం ద్వారా వారికి త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే, ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా పరిశీలించి తగిన పరిష్కారం అందించేందుకు జిల్లా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.



## రోడ్డు మరమ్మతు నిర్మాణం పనులు



నాంపల్లి, జూన్,15(ప్రజా జ్యోతి):మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ నుండి అంబేద్కర్ చౌరస్తా వెళ్ళే రహదారిలో వర్షపు నీరుతో రహదారి నిండి ప్రతిరోజు ప్రమాదాలు జరుగుతున్నాయి. కాలనీ ప్రజల సమాచారం మేరకు నాంపల్లి పట్టణ సర్పంచ్ నక్క చంద్రశేఖర్ స్పందించారు. ఈ రోడ్డు వెంట మును ముందు ప్రమాదాలు జరగకూడదని రోడ్డు మరమ్మతులు పనులు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, పిఆర్ఏఈఈ, ఆర్డబ్ల్యూ ఏఈఈ, గ్రామ ఉపసర్పంచ్ పానగంటి నిర్మల వెంకటయ్య, వార్డు నెంబర్ ఎదుళ్ల రాములు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ నోట్ల ముఠా గుట్టురట్టు..

### ఇద్దరు నిందితుల అరెస్టు..

### నకిలీ కరెన్సీ, ప్రింటర్, స్కానర్, పల్సర్ బైక్ స్వాధీనం..

### నల్లగొండ డిఎస్పీ కె. శివరాం రెడ్డి

**నల్గొండ టౌన్ 15, (ప్రజా జ్యోతి):**

నకిలీ కరెన్సీ నోట్లను తయారు చేస్తూ, చలామణీకి పాల్పడుతున్న ఇద్దరు నిందితులను చండూరు పోలీసులు అరెస్టు చేశారు. నల్గొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నిందితులు బెజవాడ రాజీవ్, దుర్గం పావనిలు రద్దీ ప్రాంతాలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకుని నకిలీ నోట్లు చలామణీ చేస్తున్నారు. వారి నుంచి నకిలీ నోట్లు, ప్రింటర్, స్కానర్, పల్సర్ బైక్ను స్వాధీనం చేసుకున్నారు. వీరి పై తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్



రాష్ట్రాల్లో కలిపి మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్, తొర్రూర్ పోలీస్ స్టేషన్, కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్,గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్,జనగాం పోలీస్ స్టేషన్,అద్దంకి పోలీస్ స్టేషన్,సుబేదారి పోలీస్ స్టేషన్ లతో కలిపి మొత్తం 07 నకిలీ నోట్ల చలామణి కేసులు నమోదు కాగా మిర్యాలగూడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో రౌడీ షీట్ నమోదై ఉంది. ఈ కేసును నల్గొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి పర్యవేక్షణలో, చండూర్ సీఐ టి. రాము ఆధ్వర్యంలో త్వరితగతిన ఛేదించిన ఎస్సై జె. శివకుమార్ మరియు వారి సిబ్బంది ఏఎస్సై శ్రీరాములు, పోలీస్ కానిస్టేబుల్ ఆనంద్ రెడ్డి, శివరాం కృష్ణ, నరేందర్, ఉపేందర్లను నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ అభినందించారు.




# వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి..

### డ్రైన్లు, యూజీడీ లైన్ల డీసిల్టింగ్ పనులను వేగవంతం చేయాలి..

### మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి




నల్లగొండ టౌన్ జూన్ 15,(ప్రజా జ్యోతి ): వర్షాకాలంలో నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మేయర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ బి. శరత్ చంద్ర



నగరంలోని 5, 38, 42 డివిజన్లలో కొనసాగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలు, డ్రైన్ల డీసిల్టింగ్ పనులు, భూగర్భ మురుగునీటి (యూజీడీ) లైన్ల శుభ్రపరిచే కార్యక్రమాలను పరిశీలించారు.ఈ సందర్భంగా రోడ్లకు ఇరువైపులా ఉన్న డ్రైన్లలో పేరుకుపోయిన సిల్టును తొలగించే పనులను, అలాగే గల్ఫర్ మిషన్ల సహాయంతో యూజీడీ లైన్లలో పేరుకుపోయిన మట్టి, చెత్త, వ్యర్థాలను తొలగించే పనులను పరిశీలించారు. వర్షాకాలంలో మురుగునీరు, వర్షపు నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఎక్కడా నీటి నిల్వలు ఏర్పడకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.డ్రైన్లు, మ్యాన్హోల్స్, యూజీడీ లైన్ల డీసిల్టింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ మున్సిపల్ యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు.ప్రజలు కూడా నగర పరిశుభ్రత పరిరక్షణలో భాగస్వాములు కావాలని మేయర్ కోరారు. గృహ వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు, నిర్మాణ వ్యర్థాలు తదితరాలను డ్రైన్లు, కాలువల్లో వేయకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. డ్రైన్లలో చెత్త వేయడం వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి వర్షాకాలంలో నీటి నిల్వలు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎక్కడైనా డ్రైనేజీ సమస్యలు, నీటి నిల్వలు లేదా పారిశుద్ధ్య లోపాలు గమనించిన వెంటనే మున్సిపల్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్వైజర్ శ్రీ జి. శ్రీనివాస్, శానిటరీ ఇన్స్పెక్టర్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## మాట నిలుపుకున్న కౌన్సిలర్... కోతుల బెడద తొలగింపు

### హర్షం వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

**మిర్యాలగూడ, జూన్ 15,( ప్రజాజ్యోతి ):**

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాటను నిలుపుకున్నారు మిర్యాలగూడ పట్టణంలోని 20వ, వార్డు కౌన్సిలర్ దేశిడి శ్రీలేఖ శేఖర్ రెడ్డి... ఏళ్ల తరబడి ఉన్న కోతుల బెడదను తొలగించడం తో... ఇచ్చిన మాట నిలుపుకున్న కౌన్సిలర్ తీరుపై కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మిర్యాలగూడ పట్టణంలోని 20,21వ వార్డులో విస్తరించిన రెడ్డి కాలనీలో కోతుల బెడద విపరీతంగా ఉండేది. కమర్షియల్ గా ఉండే రెడ్డి కాలనీకి వివిధ పనుల నిమిత్తం రోజుకు వేల సంఖ్యలో ప్రజలు వచ్చిపోతూ ఉంటారు. కోతులు అధిక సంఖ్యలో ఉండటంతో స్థానిక కాలనీవాసులతో పాటు వచ్చి పోయేవారు అనేక ఇబ్బందులు పడుతుండేవారు. చేతిలో వస్తువులు లాక్కెలటం, కరుస్తుండటం తో ప్రజలు విసిగి వేశారేవారు.కొద్ది నెలల క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తనను గెలిపిస్తే కోతుల బెడద తొలగిస్తానని కౌన్సిలర్ గా బరిలో నిలిచిన శ్రీలేఖ కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం మంకీ క్యాచర్స్ ని పిలిపించి సోమవారం సుమారు 100 కోతులకు పైగా పట్టి బోనులో బంధించి శ్రీశైలం అడవులకు తరలించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీలేఖ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే వర్షాకాలంలో భక్తులు ఇబ్బంది పడకుండా దానికి రామాలయంలో సిసి రోడ్ వేయించడం జరిగిందన్నారు. ధనుర్మాసంలో భక్తులు ఇబ్బంది పడకుండా గుడిలో ఐమాక్స్ లైట్లు, ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాలనీలో ఏ సమస్య ఉన్న అందుబాటులో ఉంటూ స్థానిక ఎమ్మెల్యే బిఎల్ఆర్, మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధాకర్,



వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ ల సహకారంతో వెంటనే పరిష్కరిస్తున్నామని తెలిపారు. మాట నిలుపుకున్న కౌన్సిలర్ పనితీరుపై కాలనీ ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో 21వ వార్డు కౌన్సిలర్ వెలుగు ఇందిరా నాగరాజు, మాజీ కౌన్సిలర్ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# గిడ్డంగి నిల్వతో రైతులకు అధిక లాభాలు

## ఎన్ఐపిహెచ్ఎం జాయింట్ డైరెక్టర్ డా.ఏ.మరియాదాస్



**గరిడేపల్లి,జూన్ 15(ప్రజాజ్యోతి):**

గిడ్డంగి నిల్వతో రైతులకు అధిక లాభాలు పొందవచ్చని ఎన్ఐపి హెచ్ఎం జాయింట్ డైరెక్టర్ డా.ఏ.మరియాదాస్ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో డబ్ల్యూడిఆర్ఏ ఒ ఎన్ డబ్ల్యూఆర్ పై రైతులు, వ్యాపారులు,పప్పు మిల్ యజమానులకు ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జాతీయ మొక్కల ఆరోగ్య పరిరక్షణ సంస్థ (ఎన్ఐపిహెచ్ఎం) జాయింట్ డైరెక్టర్ డా.ఏ. మరియాదాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిడ్డంగుల్లో ధాన్యం సురక్షితంగా నిల్వ చేసుకుంటే రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఆయన తెలిపారు.అలాగే నెగోషియబుల్ వేర్ హౌస్ రిసిప్ట్ (ఎన్ డబ్లుఆర్) ద్వారా రైతులు గోదాములో నిల్వ చేసిన ధాన్యంపై రుణాలు పొందవచ్చని, అదే విధంగా ఈ-నామ్ (ఈ-నామ్) ద్వారా ఆన్‌లైన్ విక్రయాలు కూడా చేసుకోవచ్చని వివరించారు. ధాన్యం నిల్వలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే 10--30 శాతం వరకు నష్టం జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.హెర్మటిక్ బ్యాగ్స్ వినియోగం,ఎలుకల నియంత్రణ వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు.కేవీకే సస్య రక్షణ శాస్త్రవేత్త డి. ఆదర్శ్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఎన్డబ్ల్యూఆర్ పొందే విధానం,దాని ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమం అనంతరం రైతులను నేరేడుచర్లలోని ప్రభుత్వ గిడ్డంగులకు తీసుకెళ్లి ప్రత్యక్షంగా పరిశీలన చేయించారు.ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డి. నరేష్,సి.నరేష్,పి.అక్షిత్ సాయి,ఎన్.సుగంధి సహా సుమారు రైతులు పాల్గొన్నారు.

# వెంకట్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే పద్మావతి

**గరిడేపల్లి,జూన్ 15,(ప్రజా జ్యోతి):**

మండలంలోని గానుబండ గ్రామంలో ఇటీవల మృతి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రం వెంకటరెడ్డి కుటుంబాన్ని సోమవారం కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతి పరామర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుర్రం వెంకటరెడ్డి ఆకస్మిక మృతి మండలంలోని కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని అన్నారు.కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన వెంకటరెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ఆమె తెలిపారు.మొదట వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కటకం రమేష్, వెంకట్ రెడ్డి,గుర్రం విజయలక్ష్మి, మాజీ ఎంపీటీసీ పరమేష్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ గృహాలను పరిశీలించిన చీఫ్ ఇంజనీర్

**గరిడేపల్లి,జూన్ 15,(ప్రజా జ్యోతి):**

మండల కేంద్రమైన గరిడేపల్లి లో సోమవారం హౌసింగ్ చీఫ్ ఇంజనీర్ చైతన్యకుమార్ ఇందిరమ్మ గృహాలను పరిశీలించారు.ఇందిరమ్మ గృహాలు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన ఇండ్లు కట్టుకోవాలని ఆయన సూచించారు.మండలంలో మొత్తం 441 ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు కాగా, అందులో 222 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.ప్రారంభించిన ఇళ్లలో 211 ఇళ్ల బేస్‌మెంట్ పనులు పూర్తికాగా,201 ఇళ్ల గోడల నిర్మాణం పూర్తయింది.అలాగే 194 ఇళ్ల స్లాబ్ పనులు పూర్తి కావడం విశేషం. ఇప్పటి వరకు 125 ఇళ్ల నిర్మాణం పూర్తిస్థాయిలో పూర్తై లబ్ధిదారులు గృహ ప్రవేశానికి సిద్ధమయ్యారు.ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు అధికారులు,ప్రజా ప్రతినిధుల సమన్వయంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.మిగిలిన ఇళ్ల నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు సొంతింటి కలను సాకారం చేయనున్నట్లు పేర్కొన్నారు.ఆయన వెంట ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధార్థ,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జంగయ్య, హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ యోగి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు త్రిపురం అంజన్ రెడ్డి,మేకపోతు అఖిల్, పంచాయతీ కార్యదర్శి గుగులోతు నాగేశ్వరరావు ఉన్నారు.




# అంగన్‌వాడి ఆధ్వర్యంలో బడిబాట

నిడమానూరు ,జూన్ 15(ప్రజాజ్యోతి):నిడమానూరు సెక్టార్ పరిధిలో అంగన్వాడి కేంద్రాలల్లో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు .ఈ సందర్భంగా నిడమానూరు సెక్టార్ పరిధిలోని అన్ని అంగన్వాడి కేంద్రాలలో అంగన్వాడీలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు.నిడమనూరు -1 కేంద్రంలో నిడమానూరు సర్పంచ్ శేషరాజు సంధ్య శ్రీనివాస్ లు పాల్గొని ఘనంగా ర్యాలీ చేపట్టారు.మూడు సంవత్సరాల పిల్లలను అంగన్వాడి లో చేర్పించాలన్నారు.మూడు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు ఆటపాటలతో విద్యను నిర్వహిస్తారు.ప్రైవేటు స్కూళ్లకు పిల్లలను




పంపించకూడదని చెప్పడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్
సైదాబేగం,సర్పంచ్ శేషరాజు సంధ్య ,అంగన్వాడీ టీచర్ వహీదా,అలివేలు,తల్లులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు..

# చింత చెట్టు తండా గ్రామంలో అన్ని ఇళ్లను ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో చర్చాలి..

## చింత చెట్టు తండ మొత్తం ముంపు గ్రామంగా గుర్తించండి..

## సర్పంచ్ నేనావత్ రమేష్ నాయక్



నల్గొండ కలెక్టరేట్ జూన్ 15,(ప్రజా జ్యోతి ): పెండ్లిపాకల రిజర్వాయర్ విస్తరణ వల్ల చింత చెట్టు తండా గ్రామపంచాయతీలోని చింత చెట్లు తండ ప్రజల జీవన భద్రత, ఆరోగ్యం, రవాణా సమస్యలను దృష్టిలో ఉంచుకొని గ్రామంలోని అన్ని ఇళ్లను ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో చేర్చి ఆదుకోవాలని ఆ గ్రామ ప్రజలు జిల్లా కలెక్టర్ ను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేవరకొండ నియోజకవర్గం, కొండమల్లేపల్లి మండలం, చింత చెట్టు తండా గ్రామపంచాయతీకి చెందిన నిరుపేద గిరిజన ప్రజలమని . మా జీవనాధారం ప్రధానంగా వ్యవసాయం, పశుపోషణ, దినసరి కూలీ పనులు అటవీ ఆధారిత వృత్తులపై ఆధారపడి తరతరాలుగా ఈ ప్రాంతంలో నివసిస్తూ, ప్రభుత్వంపై నమ్మకంతో శాంతియుతంగా జీవనం సాగిస్తున్నామని తెలిపారు.గతంలో చెరువు నిర్మాణం కారణంగా మా తాతలు-ముత్తాతలు తమ ఇళ్లు, భూములు, జీవనాధారాలను కోల్పోయి ఎటువంటి నష్టపరిహారం లేకుండానే చింత చెట్టు తండాకు వలస వచ్చి జీవనం కొనసాగించారని అప్పటి నుంచి ఎన్నో కష్టాలను భరిస్తూ, అయినా ప్రభుత్వంపై విశ్వాసం కోల్పోకుండా ఇక్కడ స్థిరపడ్డామని వివరించారు. ఇప్పుడు మళ్లీ పెండ్లిపాకల రిజర్వాయర్ విస్తరణ వల్ల అదే పరిస్థితి మా జీవితాల్లో పునరావృతమవుతుందేమోనన్న భయం మమ్మల్ని వెంటాడుతోందని పెండ్లిపాకల రిజర్వాయర్ విస్తరణ వల్ల నీటి నిల్వ సామర్థ్యం పెరిగి, రిజర్వాయర్ నీరు మా తండాకు అతి సమీపంగా చేరే పరిస్థితి ఏర్పడుతోందన్నా రు . ఈ నేపథ్యంలో మా తండాలోని కొన్ని ఇళ్లు మాత్రమే ఆర్ అండ్ ఆర్ పరిధిలోకి వస్తాయని అధికారులు తెలియజేస్తున్నారని చింత చెట్టు తండాలోని అన్ని ఇళ్లను ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో చేర్చి సురక్షితమైన పునరావాసం కల్పించాలని కోరారు. కలెక్టర్కు వినతి పత్రం సమర్పించిన వారిలో గ్రామ సర్పంచ్ నేనావత్ రమేష్ ఉపసర్పంచ్ రమావత్ లక్ష్మి వార్డు సభ్యులు మోతిలాల్ మూడవట్ సాలి నినావాత్ కిషన్ ఇస్లావత్ అనూష మంజుల రామావత్ వెంకటేశ్వర్లు తండావాసులు ఉన్నారు.

